

విశ్వేశ్వర కాలనీలోని ఓ గల్లీలో..


బాలుర కాలేజీ మైదానం ప్రధాన గేటు ఎదుట

అంతా బురదమయం

- రోడ్లన్నీ అధ్వానమే
- అడుగు వేయలేని దుస్థితి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలతో జిల్లా కేంద్రంలోని అంతర్గత రోడ్లన్నీ బురద మయంగా మారాయి. మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 49 వార్డులు ఉండగా వీటిలోనే పది విలీన గ్రామాలు ఎనుగొండ, ఎదిర, అప్పన్నపల్లి, పాలకొండ, బండమీదిపల్లి, చిన్నదర్‌పల్లి, బోయపల్లి, బొక్కలోనిపల్లి, తిమ్మసానిపల్లి, దొడ్డలోనిపల్లి ఉన్నాయి. చాలా చోట్ల పాత డ్రెయినేజీలే ఉండడంతో వర్షపునీరు రోడ్లపైకి వచ్చి చిత్తడి చిత్తడిగా మారాయి. ఆయా వార్డుల్లోని సీసీ రోడ్లను మూడేళ్ల క్రితం మిషన్ భగీరథ పథకం పైపులైన్ కోసం అడ్డంగా తవ్వి సరిగా పూడ్చలేదు. ఎక్కడికక్కడ గుంతలు పడ్డాయి. చాలాచోట్ల అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉండటంతో వర్షపునీరు నిలుస్తోంది. ఎక్కడ ఏ గుంత ఉందో తెలియక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక విలీన గ్రామాల్లో ఎక్కువగా మట్టి రోడ్లే శరణ్యమయ్యాయి. ప్రస్తుతం బురదతో అవి చిత్తడి చిత్తడిగా మారి అడుగు తీసి వేయలేయని పరిస్థితి నెలకొందని పాదచారులు వాపోతున్నారు.

లోతట్టు ప్రాంతాల్లో పరిస్థితి దయనీయం

ముఖ్యంగా లోతట్టు ప్రాంతాలైన బీకేరెడ్డికాలనీ, రామయ్య బౌలి, తయ్యబ్‌నగర్, శివశక్తినగర్, బాలాజీనగర్, శ్రీరాంనగర్, బీఎన్‌రెడ్డికాలనీ, గచ్చిబౌలి, పాతపాలమూరు, హబీబ్‌నగర్, గణేష్‌నగర్, కురిహినిశెట్టికాలనీ, వల్లభ్‌నగర్ తదితర ప్రాంతాల్లో పరిస్థితి దయనీయంగా ఉంది. పాత డ్రెయినేజీలు, పెద్ద నాలాలన్నీ నిండి పొంగి పొర్లాయి. బురద, మురుగు మొత్తం రోడ్లపైకి వచ్చి దుర్గంధం వెదజల్లుతోంది. పెద్దచెరువు చుట్టూ వరద కాల్వలు ఏర్పాటు చేయడంతో చెత్తాచెదారం కొట్టుకొచ్చింది. ఎర్రకుంట నుంచి వరద రావడంతో గణేష్ నగర్‌లోని వీధులతో పాటు పాత ఆర్టీఓ కార్యాలయం సమీపంలో రాయిచూర్ మెయిన్‌రోడ్డు కొన్ని గంటలపాటు జలమైన విషయం విదితమే. శనివారం సాయంత్రానికి వర్షం ఆగినా రోడ్ల పరిస్థితి ఇంకా బురదమయంగానే ఉంది.


గుంతలమయంగా అశోక్ టాకీస్ చౌరస్తా ప్రధాన రహదారి


క్లాక్‌టవర్ నుంచి మార్కెట్ రోడ్డు


25వార్డులోని ఖలీల్ మసీదు వద్ద..


పద్మావతి కాలనీ కృష్ణా టెంపుల్ చౌరస్తాలో..


పురపాలిక కార్యాలయం ఎదుట


మర్లులోని ప్రధాన రోడ్డుపై నిలిచిన నీరు

పాత విధానంపై సానుకూలం!

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉన్నట్లు టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు రాజీవ్‌రెడ్డి, కార్యదర్శి చంద్రనాయక్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. టీఎన్‌జీఓ రాష్ట్ర నాయకత్వం ప్రభుత్వంతో చర్చలు జరపనున్నట్లు వివరించారు. మధ్యంతర భృతి కూడా ఇస్తుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ మేరకు సంబంధిత ఫైల్స్ సీఎం కేసీఆర్ వద్ద ఉన్నట్లు త్వరలో తీపికబురు వినిపించే అవకాశం ఉందని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

జెడ్పీసెంటర్‌మ (మహబూబ్‌నగర్): విద్యుత్ భవన్ ఫీడర్ బైఫరికేషన్ కారణంగా ఆదివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు సరఫరా ఉండదని ఏఈ భగవంతయ్య శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో భాగంగా మహేశ్వరి టాకీస్, శ్రీనివాస్‌కాలనీ, పద్మావతికాలనీ, మర్లు, టీచర్స్ కాలనీ, బీకేరెడ్డికాలనీ ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందని ప్రజలు సహకరించాలని కోరారు.

ఆర్థిక సాయం

అడ్డాకుల: కందూర్ ఆలయ కమిటీ సభ్యుడు పిల్లి చంద్రమౌళి తల్లి చెన్నమ్మ అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని శనివారం బీఆర్‌ఎస్ నాయకులు పరామర్శించారు. జెడ్పీటీసీ సభ్యుడు రాజశేఖర్‌రెడ్డి పంపించిన రూ.10వేల నగదును బాధితకుటుంబానికి అందజేశారు. సర్పంచ్ శ్రీకాంత్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ రమేష్‌గౌడ్, శ్రీనివాస్ యాదవ్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

'ఆర్‌ఆర్‌ఆర్'కు దుస్తుల అందజేత



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణంలోని ప్రజలకు ప్రతి వారం రెడ్యూస్-రీయూజ్-రీసైకిల్ (ఆర్‌ఆర్‌ఆర్) పై మున్సిపల్ సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. అందులో భాగంగా శనివారం వార్డు నం.25లోని గల్లీలలో విస్తృతంగా తిరిగారు. ఈ సందర్భంగా వారికి దాతలు మూడు పాత చీరలతో పాటు ఏడు నోట్‌బుక్స్ అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌ఆర్‌ఆర్ సూపర్‌వైజర్ ఉమ, ఆర్‌పీ మహేశ్వరితో, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

రైల్వే గేట్ తెరవాలని కేంద్రమంత్రికి వినతి



దేవరకద్ర: నియోజకవర్గ కేంద్రంలో ఇటీవల మూసిన రైల్వే గేట్‌ను తెరవాలని రైల్వే శాఖ సహాయ మంత్రి రావుసాహెబ్ పాటిల్ దన్వేను శనివారం బీజేపీ రాష్ట్ర నాయకులు బాలన్న కోరారు. ఈ మేరకు ఢిల్లీలో ఆయనను కలిసి వినతిపత్రం అందించారు. గేట్ మూయడం వల్ల వ్యాపారులు దెబ్బతిన్నారని, బ్రిడ్జి సరైన ప్రణాళిక లేకుండా కట్టడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. రాకపోకలకు ప్రత్యామ్నయ ఏర్పాట్లు చేసే వరకు రైల్వే గేట్‌ను తెరిచి ఉంచాలని కోరారు. దీంతో స్పందించిన మంత్రి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారని, సాధ్యాసాధ్యాల పరిశీలన అనంతరం గేట్‌ను తెరిపించే ప్రయత్నం చేయాలని వారికి సూచించారని వివరించారు.

24న అవార్డుల ప్రదానోత్సవం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: విలేజ్ ఇన్ పార్ట్‌నర్ సంస్థ ఆధ్వర్యంలో గత విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్‌లో మండలానికి ఒకరి చొప్పున టాపర్లుగా నిలిచిన వారికి ఈ నెల 24న అవార్డులు ఇవ్వనున్నారు. ఈ మేరకు సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నాగేందర్‌స్వామి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రలోభాలకు లొంగవద్దు

రాజాపూర్: ప్రలోభాలకు లొంగి విద్యార్థులు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని మండలపరిషత్ అభివృద్ధి అధికారి లక్ష్మీదేవి అన్నారు. మండల శివారులోని కస్తూర్బాలో ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం పోలీసు కళాజాతా నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడారు. ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే ఉపాధ్యాయులకు లేదా తల్లిదండ్రులకు తెలపాలని సూచించారు. ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ప్రేమపేరుతో ఎవరైనా ఇబ్బందలకు గురిచేస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు. ముఖ్యంగా సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలని వివరించారు. ప్రిన్సిపాల్ పావని, ఉపాధ్యాయురాలు స్వాతి, రాజాపూర్ ఉపసర్పంచ్ అల్లెశ్రీనివాస్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



లోతట్టు ప్రాంతాల పరిస్థితి మారలేదు

పాలమూరు: ఏడాది గడిచిపోయినా లోతట్టు ప్రాంతాల పరిస్థితి మారలేదని బీజేపీ నాయకులు అన్నారు. గత ఏడాది మంత్రి లోతట్టు ప్రాంతాల ప్రజల ఇళ్లలోకి నీళ్లు రాకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతామని చెప్పినా ఇప్పటికీ ఎలాంటి మార్పు రాలేదని జిల్లా అధ్యక్షుడు వీర బ్రహ్మచారి విమర్శించారు. శనివారం పట్టణంలోని గణేష్‌నగర్, ఎర్రగుంట అలుగును సందర్శించారు. లోతట్టు ప్రాంతాలు అయిన రామయ్యబౌళి, శివశక్తినగర్, మేకల బండ, గణేష్ నగర్ ప్రాంతాలు పూర్తిగా జలమయం అవుతున్నాయని అన్నారు. సుందరీకరణ పేరుతో వర్షపు నీరు పెద్ద చెరువులోకి రాకుండా మట్టి వేయడంతో ఇబ్బందులు ఏర్పడ్డాయన్నారు.


ఎర్రగుంటను పరిశీలిస్తున్న నాయకులు

వెళ్లడానికి మార్గాలు లేక నీరు ఇళ్లలోకి ప్రవేశిస్తున్నట్లు తెలిపారు. కృష్ణవర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పాండురంగారెడ్డి, నారాయణ యాదవ్ పాల్గొన్నారు.

చెరువుకట్ట గండిపూడ్చివేత



మహమ్మదాబాద్: నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మహమ్మదాబాద్ మల్కచెరువు తూము వద్ద గండిపడటంతో తహసీల్దార్ ఆంజనేయులు పరిశీలించారు. జేసీబీ, ట్రాక్టర్ల సాయంతో శనివారం గండిని పూడ్చివేయించారు. మండలంలో అతిపెద్దది అయిన మల్కచెరువు కట్టకు గండిపడటంతో రైతులు ఆందోళన చెందారు. అధికారులు చర్యలు చేపట్టడంతో ఆనందం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం



చిన్నచింతకుంట: కాంగ్రెస్ పార్టీ రాబోయే ఎన్నికల్లో విజయం సాధించడం ఖాయమని జిల్లా అధ్యక్షుడు జి మధుసూదన్‌రెడ్డి అన్నారు. శనివారం ధమగ్నాపురంలోని ఆయన నివాసంలోఅమ్మపురం గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరిన సందర్భంగా మాట్లాడారు. ప్రజలు తమ పార్టీని ఆదరిస్తున్నారన్నారు. గతంలో కాంగ్రెస్ హయాంలోనే అన్ని వర్గాల ప్రజలకు సముచిత న్యాయం జరిగిందన్నారు. కరెంట్‌పై బీఆర్‌ఎస్ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. నాయకులు జాకీర్, ఎస్ వెంకటేష్, వెంకటేష్ యాదవ్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఏదులాపూర్ గ్రామానికి చెందిన పలువురు నాయకులు హైదరాబాద్‌లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్‌కుమార్‌యాదవ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

వర్షాలకు కూలిన ఇల్లు



బాలానగర్: గంగాదరిపల్లి గ్రామం కుంటలోపు తండాలో మట్టి గోడలతో ఉన్న పాత్లావత్ రుక్క రేకుల ఇల్లు నాలుగు రోజులుగా కురిసిన వర్షాలకు కూలిపోయింది.దీంతో సర్పంచ్ కొమురమ్మ శనివారం పరిశీలించి ప్రభుత్వం పరంగా ఆదుకోవాలని తహసిల్దార్‌కు విన్నవించారు. ఈ మేరకు ఇంటిని పరిశీలించిన ఆర్‌ఐ రాజేశ్వరి ఉన్నత అధికారులకు నివేదిక పంపుతామని వివరించారు. ఆమె వెంట తండా వాసులు వెంకటేష్, సమ్యానాయక్, అమృ నాయక్, రాజు తదితరులు ఉన్నారు. కాగా వృద్ధురాలు అయిన రుక్క నిలబడి ఉండలేని పరిస్థితి ఉందని, ఆమె భర్త 20 ఏళ్ల క్రితమే మృతి చెందాడని, ఎలాంటి ఆధారం లేదని గ్రామస్తులు తెలిపారు. ప్రతి నెలా వచ్చే పింఛన్‌పై ఆధారపడి జీవిస్తోందని వివరించారు. అయినప్పటికీ కొడుకు శివ(18)ను డిప్లొమా వరకు చదివించిందని కానీ ఎలాంటి ఆధారం లేకపోవడంతో అతడు కూలీ పనులకు వెళ్తున్నాడని స్థానికులు తెలిపారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

జడ్చర్ల టౌన్: ముస్లింలకు మైనార్టీ కార్పొరేషన్ ద్వారా బ్యాంక్‌తో సంబంధం లేకుండా రూ.1లక్ష ఇస్తామని ప్రకటించటంపై సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిల చిత్రపటాలకు నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఫకీర్ సంక్షేమసంఘం రాష్ట్ర అధ్యక్షుడు జహంగీర్ ఆధ్వర్యంలో శనివారం కార్యక్రమం నిర్వహించారు. ఫకీర్‌లు పాల్గొన్నారు.

ఆపద్బాంధవుడు కేసీఆర్



కోయిల్‌కొండ: దేశంలో ఎక్కడాలేని విధంగా ఎన్నో సంక్షేమం పథకాలు ప్రవేశపెట్టిన సీఎం కేసీఆర్ రైతులకు ఆపద్బాంధవుడుగా మారారని నారాయణపేట ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని శేరివెంకటాపూర్ రైతువేదికలో నిర్వహించిన రైతుసదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఎం కేసీఆర్ 24గంటల ఉచిత కరెంట్ ఇస్తుంటే కాంగ్రెస్ నాయకులు 3గంటలు సరిపోతుందనడం సిగ్గుచేటన్నారు. రేవంత్‌రెడ్డి రైతులకు క్షమాపణ చెప్పాలన్నారు. కటిక చీకట్ల కాంగ్రెస్సా.. కరెంట్ వెలుగుల బీఆర్‌ఎస్సా.. ఏది కావాలో రైతులు నిర్ణయించుకోవాలని సూచించారు. నియోజకవర్గ సమన్వయకర్త రవీందర్‌రెడ్డి, జెడ్పీటీసీ విజయభాస్కర్‌రెడ్డి, సింగిల్‌విండోచైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, భీంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: హన్వాడ కార్మికులు చేపట్టిన సమ్మెకు శనివారం రైతు సంఘం, ఎస్‌ఎఫ్‌ఐ, కేవీపీఎస్ సంఘాలు మద్దతు తెలిపాయి. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు భరత్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కురుమయ్య, పాల్గొన్నారు.
నవాబుపేట: మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులు భిక్షాటన చేసి తమ నిరసనను తెలిపారు. కార్మిక సంఘం నాయకులు లక్ష్మయ్య, శ్రీనివాస్, రమేష్, వెంకటయ్య ఉన్నారు.
అడ్డాకుల: కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు కిల్లె గోపాల్, కురుమూర్తి డిమాండ్ చేశారు. అడ్డాకులలో సమ్మెకు సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. అంతకు ముందు కార్మికులు భిక్షాటన చేశారు.
మిడ్జిల్: కార్మికుల సమ్మె శనివారం నాటికి 17వ రోజుకు చేరింది. మండల అధ్యక్షుడు జంగయ్య, అచ్చలయ్య, బాలస్వామి, యాదయ్య, పాల్గొన్నారు.
గండీడ్: పంచాయతీ కార్మికులు శనివారం తహసీల్దార్ కార్యాలయంలో భిక్షాటన చేసి నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

బూరెడ్డిపల్లిలో గొర్రెల పంపిణీ

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటి పరిధిలోని 7వ వార్డు బూరెడ్డిపల్లిలో శనివారం ఆరుగురు సభ్యులకు 126 గొర్రెలను కౌన్సిలర్ జి. ఉమాదేవి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గొల్ల కురుమలు ఆర్థికంగా ఎదగాలని సీఎం గొర్రెల పంపిణీకి శ్రీకారం చుట్టారని అన్నారు. సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పశువైద్యాధికారులు ఆశారాణి, కవిత, యాదవసంఘం అధ్యక్షుడు చెన్నకేశవులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు



జడ్చర్ల: పట్టణంలో శనివారం మున్సిపల్ అధికారులు, పాలక మండలి సభ్యులు ముమ్మరంగా పారిశుధ్య పనులు చేయించారు. వరుసగా కురుస్తున్న వర్షాలతో ఎక్కడికక్కడా వరద నీరు నిల్వ ఉండడంతో చర్యలు చేపట్టారు. నిమ్మబాయి గడ్డ తదితర కాలనీలలో మురుగు కాల్వలను శుభ్రం చేయించారు. చైర్‌పర్సన్ లక్ష్మి, కమిషనర్ మహ్మద్ షేక్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లకు కంచెలు ఏర్పాటు చేయాలి

జడ్చర్ల: మున్సిపాలిటీ పరిధిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లకు కంచెలు ఏర్పాటు చేయాలని బీజేపీ నాయకులు అన్నారు. ఈ మేరకు శనివారం విద్యుత్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం సమర్పించారు. వర్షాకాలం కావడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉందని వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. కౌన్సిలర్ రాజు, పట్టణ అధ్యక్షుడు నాగరాజు, వెంకట్, రాజశేఖర్‌రెడ్డి, అనంత కిషన్ తదితరులు పాల్గొన్నారు.

సంకల్ప రథయాత్రకు తరలిరావాలి

చిన్నచింతకుంట: పాతపెన్షన్ విధానం సాధన సంకల్ప రథయాత్రకు ఉద్యోగులు అధికసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని టీఎస్‌సీపీఎస్ ఈయూ జిల్లా అధ్యక్షుడు సనాతన బాలస్వామి కోరారు. మండలకేంద్రలో ఎంపీడీఓ శ్రీనివాస్ రెడ్డితో కలిసి పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్ర వాల్‌పోస్టర్‌ను శనివారం విడుదల చేశారు. ఈనెల 30న మహబూబ్‌నగర్‌లో యాత్ర ఉంటుందన్నారు. తహసీల్దార్ సువర్ణరాజు, నాయకులు రాఘవేంద్ర, అనిల్‌కుమార్, శశికిరణ్, సంజీవయ్య, శ్రీనివాస్, వెంకట్‌రాములు పాల్గొన్నారు.

'మణిపూర్' బాధ్యులపై చర్యలు తీసుకోవాలి



జెడ్పీసెంటర్‌మ (మహబూబ్‌నగర్): మణిపూర్ రాష్ట్రంలో మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటనలో బాధ్యులను చట్టపరంగా శిక్షించాలని మాజీ సైనికులు డిమాండ్ చేశారు. బాధితులలో మాజీ సైనికుడి భార్య కూడా ఉందని అన్నారు. నిందితులను వెంటనే శిక్షించాలని శనివారం తెలంగాణ చౌరస్తాలో కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. మహిళలను నగ్నంగా ఊరేగించడం సభ్యసమాజం తలదించుకునే ఘటన అని అన్నారు. భిక్షపతి, ఎంఆర్‌కేరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, రాములు, రఘుపతిరెడ్డి, రామేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.
మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో మణిపూర్‌లో జరిగిన ఘటనకు వ్యతిరేకంగా శనివారం నిరసన తెలిపారు. ఈమేరకు పలువురు సంఘం నాయకులు మాటాడారు. మణిపూర్‌లో స్త్రీలపై జరిగిన ఘటనలు మానవాత్వానికే మాయని మచ్చ అని అన్నారు. రాకేష్, కల్యాణ్, ఆంజనేయులు, జగదీష్, సత్యశివ, తాయప్ప తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి


ముసాపేటలో మొక్కల పంపిణీ

నవాబుపేట: ప్రతి ఇంటి ఆవరణలో మొక్కలు పెంచి సంరక్షించాలని మండల అభివృద్ధి అధికారి శ్రీలత సూచించారు. శనివారం కిషన్‌గూడలో ఇంటింటికీ ఆరు మొక్కల పంపిణీ ప్రారంభించారు. ఏపీఓ జ్యోతీ సర్పంచ్ రాములమ్మ, సత్యం తదితరులు పాల్గొన్నారు.
అడ్డాకుల: ప్రతి ఒక్కరు తమ ఇళ్ల పరిసరాల్లో మొక్కలను నాటి సంరక్షించాలని ఎంపీడీఓ స్వరూప అన్నారు. మూసాపేటలోని నర్సరీ వద్ద శనివారం మొక్కలను పంపిణీ చేశారు. ఏపీఎం పులేందర్, పంచాయతీ కార్యదర్శి మహేందర్, ఉప సర్పంచ్ తాజోద్దీన్, నాయకులు తదితరులు ఉన్నారు.
బాలానగర్: హరితహారం విజయవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి ఇండస్ట్రీ జీఎం బాబురావు అన్నారు. శనివారం బోడగుట్ట తండాలో క్రీడా ప్రాంగణాన్ని పరిశీలించారు. ఎంపీడీఓ కృష్ణారావుతో కలిసి మొక్కలు నాటారు. ఏపీఓ రాజశేఖర్ రెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు.

డబుల్ ఓట్లను వెంటనే తొలగించాలి


శిక్షణకు హాజరైన బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లు

జెడ్పీసెంటర్(మహబూనగర్) : బీఎల్‌ఓలు ఇంటింటి సర్వే చేపట్టి డబుల్ ఓట్లు వెంటనే తొలగించాలని మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్దార్ పార్థసారధి ఆదేశించారు. శనివారం బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లకు ఓటర్‌జాబితాపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. డబుల్ ఓట్ల విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. 18 ఏళ్లు నిండిన వారిని కొత్తగా జాబితాలో నమోదు చేయాలని, వారితో ఫారం 6 ద్వారా వివరాలు నమోదు చేయాలని సూచించారు. ఓటర్ జాబితాలో తప్పులు లేకుండా జాగ్రత్తపడాలని పేర్కొన్నారు. ఆర్‌ఐ నర్సింగ్, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

నిరుపేదలకు సేవలు అందజేయాలి



స్టేషన్ మహబూబ్‌నగర్: పేదల అవసరాలను గుర్తించి వారికి తగిన సేవలు అందజేయాలని లయన్ హరినారాయణ్ భట్టాడ్ అన్నారు. యూఎస్‌ఏ బోస్టన్‌లో లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్‌గా ప్రమాణం స్వీకారం చేసి తొలిసారిగా జిల్లా కేంద్రం బస్టాండ్ సమీపంలోని శ్రీద్వారకామాయి సాయిబాబా మందిరాన్ని శనివారం దర్శించుకున్నారు. అనంతరం లయన్స్ క్లబ్ ఆఫ్ మహబూబ్‌నగర్, లయన్స్ క్లబ్ పాలమూరు సంయుక్తంగా నిర్వహించిన సేవా కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. భట్టాడ్‌తోపాటు, లయన్ నటరాజ్‌ను ఘనంగా సన్మానించారు. మహబూబ్‌నగర్ అధ్యక్ష, కార్యదర్శులు కె.శ్రీహరి, మహేష్‌కుమార్, పాలమూరు అధ్యక్ష, కార్యదర్శులు గిరిధర్‌రెడ్డి, ప్రహ్లాద్‌రెడ్డి, రీజియన్ చైర్మన్ గాజుల శ్రీనివాసులు, జోన్ చైర్మన్ గోవర్ధన్, సీనియర్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.